ఆదర్శ గురువులుగా వైవీయూ అధ్యాపకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అధ్యాపకులు నలుగురిని ఉత్తమ గురువులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆచార్య ఎం. అనిత(ఎకనామిక్స్), ఆచార్య విజయభారతి (కామర్స్), ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి (మైక్రోబయాలజీ), అకాడమిక్ కన్సల్టెంట్ ఎస్. ఖాజాపీర్ (ఉర్దూ) ఈ జాబితాలో ఉన్నారు. ఈనెల 11న 'జాతీయ విద్యా దినోత్సవం' సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో వీరిని ఘనంగా సత్కరించనుంది. వైవీయూ అధ్యాపకులు నలుగురికి పురస్కారాలు లభించడం పట్ల విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు, బోధ నేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

గళం విప్పేనా?

- ఉక్కు సంకల్పం ప్రదర్శించేనా
- కొప్పర్తి ఎంఎస్ఎంఇపై స్పష్టత లభించేనా
- నిలిచిన జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు
- నత్తనడకన కృష్ణా-పెన్నా ఎత్తిపోతల పథకాలు
- నేటి నుంచి శాసనసభ సమావేశాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో శాసనసభ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఉరుముతోంది. రాష్ట్ర విభజన చట్టంలో ఆర్టికల్లో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామనే హామీల అమలు చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. 2014లో విభజిత రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శాసనసభ సాక్షిగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జిల్లాను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపించారు. టిడిపి, వైసిపి పాలనలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో ఎటువంటి పురోగతి లేకపోవడం ఆందోళన కలిగించింది. రాయలసీమకు గుండెకాయ గండికోట సాగునీటి ప్రాజెక్టు. ఇటువంటి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలు లేకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. దీనికితోడు గాలేరు-నగరి ఫేజ్-2 పనులు గ్రహణం వీడలేదు. వెలిగల్లు రిజర్వాయర్కు డిస్ట్రిబ్యూటరీలు చేపట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. కుందూ-పెన్నా వరదకాల్వ, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులు ముందుకు సాగకపోవడం విమర్శలకు తావిస్తోంది. కడప సూపర్స్పెషాలిటీ నిపుణుల నియామకాలు, పరికరాల ఏర్పాటు, టెక్నీషియన్ల నియామకాలు ఎప్పుడు చేపడతారో తెలియ డం లేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో నేటి నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంఘాలు పేర్కొంటున్నాయి.

రాష్ట్ర శాసనసభ సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈమేరకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు రాజధానికి చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 13 నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఇందులో రెండు పార్లమెంట్ స్థానాలు వైసిపి, 13 శాసనసభ స్థానాల్లో మూడు మినహా 10 స్థానాల్లో ఒక్కొక్కటి చొప్పున జనసేన, బిజెపి దక్కించుకోగా, మిగిలిన ఎనిమిది స్థానాల్లో టిడిపి కైవసం చేసుకుంది. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధి బాధ్యత అధికార, ప్రతి పక్షాల భుజాలపై పడింది. జిల్లాలో కూటమి పార్టీలు పైచేయి సాధించిన నేపథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీయించాల్సిన బాధ్యత కూటమిపై ఉం ది. 2017 నవంబర్లో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలో మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్ప త్తిని సైతం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. మూడేళ్ల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనుల్లో నెలకొన్న స్తబ్ధతను తొలగించి, రాష్ట్ర వాటాను జతపరిచి పట్టాలెక్కించాల్సిన అవసరం ఉరుముతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించాలి.

కొప్పర్తి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేయాల్సిన ఎంఎస్ఎంఇ పార్కు తరలిపోవచ్చునని నిలవరించాల్సిన బాధ్యత కూటమి ప్రజాప్రతినిధులపై ఉంది. గండికోట నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ సాగుతునే ఉంది. గాలేరు-నగరి ఫేజ్-2 పనులకు గ్రహణం తొలగడం లేదు. కడపలో రూ.12 కోట్లతో ఫుడ్ పార్కును ఏర్పాటు చేస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదేళ్లుగా ఫుడ్పార్కు కాగితాలకే పరిమితమైంది. ఫుడ్పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేది. 2005- 06లో మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖర్రెడ్డి మైలవరం మండలంలో టెక్స్టైల్ పార్కు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. సుమారు 60 ఎకరాలను 128 ప్లాట్లుగా విభజించారు. రూ.7.4 కోట్లతో పనులు చేపట్టారు. 2.8 కోట్ల రూపాయలను వ్యయం చేసినట్లు సమాచారం. అనంతరం ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఎపికెరాస్ట్ రూ. 255 కోట్లతో పరిపాలనా భవనానికి వ్యయం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ పశువుల పిండాలను సంకరీకరణ ద్వారా వాతావరణానికి తట్టుకోగల నూతన జాతి పశువులను సృజన ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది. రైల్వేకోడూరు ప్రాంతంలో వాణిజ్య పంటల వ్యాపారం సాగుతోంది. నందలూరు ప్రాంతంలోని 200 ఎకరాల్లో హార్టీ కల్చర్ యూనివర్శిటీ మంజూరు చేయిస్తానని ప్రకటించిన హామీ కాగితాలకే పరిమితమైంది. గండికోట పర్యాటక ప్రాజెక్టును గ్రేటర్ క్యాన్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టారు. రూ.500 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతామని గండికోట ఉత్సవాలకు హాజరైన అప్పటి టిడిపి మంత్రులు హామీలిచ్చారు. జిల్లాలో అమలుకు నోచుకోని అంశాలపై ప్రజా ప్రతినిధులు చర్చకు తీసుకొచ్చి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

కడప- రాయచోటి ఘాట్ టన్నెల్, కడప-పీలేరు నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు కృషి చేస్తా. హంద్రీ-నీవా ప్రాజెక్టు పనుల పురోగతికి నిధుల కేటాయింపులు చేయడానికి ప్రయత్నం చేస్తా. దీంతో శ్రీనివాస పురం రిజర్వాయర్ ఉపయోగంలోకి వస్తుంది.

- మండిపల్లి రాంప్రసాద్రెడ్డి, రవాణా శాఖా మంత్రి.

కార్పొరేషన్ అవినీతిని వెలికితీస్తాం

గత పదేళ్లుగా కార్పొరేషన్లో అవినీతి ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ఇటువంటి అధికార, దుహంకారానికి ముకుతాడు వేస్తాం. కడప ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వ దృష్టి తీసుకెళ్తా. కడప నగర మనసుల్లి చూరగొనే ప్రయత్నం చేస్తా.

- ఆర్.మాధవి, ఎమ్మెల్యే, కడప.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- రైతులకు అవగాహన సదస్సులు
- పండ్లు, కూరగాయల సాగుకు సబ్సిడీ
- హార్టీకల్చర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎస్.ఎస్.వి. సుభాషిణి

ప్రజాశక్తి - కడపప్రతినిధి

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం పెరుగుతోంది. జిల్లావ్యాప్తంగా పండ్లతోటలు సహా కూరగాయలు, పువ్వుల సాగును కలిపితే 25 రకాల ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఉద్యాన పంటల సాగుకు మెరుగైన ప్రోత్సాహకాలతో ముందుకు సాగుతున్నాం. జిల్లాను హార్టీకల్చర్ హబ్గా తీర్చిదిద్దుతామనే సాగుతున్న ప్రచారాన్ని సాకారం చేసుకునే దిశగా కదులుతున్నాం. అరటి, మామిడి, చీనీ దిగుబడుల్లో ముందంజలో ఉన్నాం. ఉద్యాన, వాణిజ్య పంటల దిగుబడులకు మంచి ధరలు లభించడం, వాటిని విదేశాలకు ఎగుమతులు చేయడం ద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని సమకూర్చడంపై దృష్టి సారించామని పేర్కొంటున్న హార్టీకల్చర్ డిప్యూటీ (ఎఫ్ఎసి) డైరెక్టర్ ఎస్.ఎస్.వి. సుభాషిణితో ముఖాముఖి...

ముఖాముఖి..

ఉద్యాన సాగు వివరాలు తెలపండి?

జిల్లాలో 1.60.733 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. దేశీయంగా ఉద్యాన పంటలకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఉద్యాన, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాం. ఇందులో భాగంగా ఏటా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం స్వల్పంగా పెరుగుతోంది. ఇందులో అరటి, మామిడి, చీనీతోటలు, కూరగాయల తోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి.

ఉద్యాన స్కీమ్ల వివరాలు చెప్పండి?

ఎంఐడిహెచ్, ఆర్కెవివై స్కీములు అమల్లో ఉన్నాయి. మిషన్ ఇంటెగ్రేటెడ్ డెవలప్మెంట్ పథకం కింద 40 నుంచి 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నాం. ఆర్కెవివై స్కీమ్ కింద పత్తి సెంటర్లలో 35 శాతం సబ్సిడీ, ఆరెంజ్, కూరగాయల సాగుకు 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నాం.

పండ్లతోటల వివరాలు తెలపండి?

జిల్లాలో 25 రకాల పండ్లతోటలు సాగవుతున్నాయి. పండ్ల తోటలతోపాటు ఎనిమిది రకాల కూరగాయలు, పువ్వుల తోటలు సాగవుతున్నాయి. ఇందులో 10,112 ఎకరాల్లో మామిడి, 20,431 ఎకరాల్లో అరటి, 65,379 ఎకరాల్లో చీనీ, 2011 ఎకరాల్లో సపోటా, 835 ఎక రాల్లో బొప్పాయి సాగవుతోంది. వీటితోపాటు జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, ఉల్లి, టమోటా, చామంతి తదితర పూలతోటలు సాగులో ఉన్నాయి.

హార్టీహబ్ ప్రచారంలో వాస్తవికత ఎంత?

హార్టీకల్చర్ హబ్గా మారుస్తామనే ప్రచారంలో వాస్తవికత ఉంది. రాష్ట్రంలోనే జిల్లాలో పండ్లతోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి. జిల్లాలోని పులివెందుల ప్రాంతం నుంచి అరటి ఉత్పత్తులు మధ్య ఆసియా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇప్పటి వరకు దేశాయ్ కంపెనీ, ఐఎన్ఐ, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీల ఆధ్వర్యంలో ఎగుమతులు జరుగుతున్నాయి. ఇదేతరహాలో వీరబల్లి బేనీషా రకం మామిడి దేశ, విదేశీ మార్కెట్లకు తరలిపోయే అవకాశాలు ఉన్నాయి. దీంతో పాటు దోస, బొప్పాయి ఉత్పత్తులు అదేదారిలో ఉన్నాయి.

ఉద్యాన సాగు విస్తీర్ణం పెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

నవంబర్ నుంచి ఫ్రిబవరి వరకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇందులోభాగంగా కెవికె, యూనివర్శిటీ శాస్త్రజ్ఞులతో కలిసి చక్రాయపేట, సిద్ధవటం, వేముల, వీరపునాయునిపల్లి మండలాల్లో నిర్వహించడమైంది. పెండ్లిమర్రి మండలంలోని పూలు, సిద్ధవటం మండలంలో కళింగ, దోస, పుచ్చకాయ వంటి పండ్లతోటలు సాగుతుండడం గమనార్హం. వీటి సంరక్షణకు ఇప్పటికే రైపనింగ్ఛాంబర్స్, ఫుడ్ప్రాసెసింగ్ యూనిట్లు, పండ్లరసాల కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది.

సబ్సిడీల వివరాలు తెలపండి?

రైపనింగ్ ఛాంబర్స్, శీతలీకరణ కేంద్రాల ఏర్పాటుకు సబ్సిడీలు ఇస్తున్నాం. ఎఫ్పిఓలకు 75 శాతం కలెక్షన్ సెంటర్లుకు, వ్యక్తిగత కోటా కింద రైతులకు 35 శాతం చొప్పున సబ్సిడీలు అందిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో ఐదు ప్రాంతాల్లో రైపనింగ్ ఛాంబర్స్ ఏర్పాటు చేశాం. రైతులు దరఖాస్తు చేసిన వెంటనే స్పందిస్తున్నాం. దీంతోపాటు ఫుడ్ప్రాసెసింగ్ యూనిట్లు, పండ్ల రసాల పరిశ్రమల స్థాపనలను ప్రోత్సహిస్తున్నాం. ఫలి తంగా రైతుల దిగుబడులకు మెరుగైన ధర లభించడంతోపాటు ఆర్థిక జవ సత్వాలు ఒనగూరే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అను కుంటు న్నాం.

ఫుడ్ప్రాసెసింగ్ ఏర్పాటుపై స్పందించండి?

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం అమల్లో భాగంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో ఫుడ్ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాం. 35 శాతం సబ్సిడీతో యువతను ప్రోత్సహిస్తోంది.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిరాజా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

విజయకాంక్షతో లక్ష్యం వైపు అడుగులేయాలి

ప్రజాశక్తి - కడప

కల్నల్తో మాట్లాడుతున్న జెసి

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి హాజరయిన అభర్థులు విజయ కాంక్షతో , ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన దిశగా అడుగులే యాలని జెసి అదితి సింగ్ పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆదివారం వేకువజామున ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ, ఎంపికలు రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నన్ పునీత్ ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి జెసి అదితి సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మొదటి దశ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీకి హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీలో చేరేందుకు నిర్వహించే ఎంపికకు ఇప్పటికే రాత పరీక్ష పూర్తయి అందులో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. వారందరూ ఫిజికల్ టెస్టులకు హాజరై కడపకు వచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. ర్యాలీలో పాల్గొనే వారు విజయకాంక్షతో కృత నిశ్చయంతో ముందడుగు వేయాలన్నారు. ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించే ఎంపికలో అభ్యర్థులు విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా, భారత సైన్యంలో మీరు ఒక్కరుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఇర్విన్, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేష్ చంద్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ఇమామ్ హుస్సేన్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఇమామ్ హుస్సేన్ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. 20 సంవత్సరాల పాటు ఆంధ్ర భూమి దినపత్రికలో కల్చలర్ రిపోర్టర్గా, కంప్యూటర్ ఆపరేటర్గా సేవలు అందించారు. కరోనా మహమ్మారి కారణంగా ఆంధ్రభూమి మూత బడడంతో చిన్నపాటి దినపత్రికలో పనిచేస్తూ వచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని నెట్టు కొస్తున్న ఇమామ్ మృతి చెందడంతో పాత్రికేయులందరూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఇమామ్ భౌతిక గాయాన్ని ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో రవీంద్ర నగర్ లోని కబ్రిస్తాన్లో దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్ : అంజుమన్ తరఖి ఉర్దూ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఉర్దూ సెమినార్లో చైర్మన్ సత్తార్ ఫైజి, కన్వీనర్ హిదాయతుల్లా ఉర్దూ భాషాభివృద్ధికై 40 తీర్మానాలు ప్రవేశపెట్టి వెల్లడించారు. ఈ సందర్భంగా సెమినార్ చైర్మన్ సత్తార్ ఫైజి మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ చైర్మన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఉర్దూ చదవడం, రాయడం తెలిసిన వారై ఉండాలన్నారు. అకాడమీ నెలవారీ, రోజువారీ జర్నల్ను ప్రారంభించాలని పేర్కొన్నారు. అన్ని అకాడమీ అవార్డుల మొత్తాన్ని పెంచాలని, ఉర్దూ అకాడమీ కవులు, రచయితల పుస్తకాలను బహుమతులతో ప్రదానం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సలీం బాషా, డాక్టర్ ఖాసీం అలీ ఖాన్, డాక్టర్ దావూద్ మోహ్సిన్, డాక్టర్ అహ్మద్ ఫరీస్, డాక్టర్ ఖాజి హబీబ్, యునైటెడ్ ముస్లిం ఫోరం అధ్యక్షులు అష్రఫ్ అలీ ఖాన్, రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, ప్రముఖ కవి మహమూద్ షాహిద్, ఉర్దూ విభాగ అధ్యక్షురాలు షాజియా బేగం, షఫీవుల్లా ఖాన్, డాక్టర్ నిసార్ అహమద్, డాక్టర్ ఇక్బాల్ ఖుస్రు, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా, కడప ఇస్లామిక్ సొసైటీ డైరెక్టర్ ఇస్హాక్ బాషా, అబ్దుల్ అజీజ్, అంజుమన్ తరఖి కౌన్సిల్ సభ్యులు నజీర్ అహ్మద్, సిరాజ్ బుఖారి, రహమతుల్లా, ఎం ఎ ఖదీర్ పర్వేజ్, మక్బూల్, యూనుస్, ముహమ్మద్ అయ్యుబ్ ,మహబూబ్ బాషా, ఇర్షాద్, పెద్ద సంఖ్యలో ఉర్దూ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తలపడుతున్న విజయనగరం, నెల్లూరు జట్లు

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-14 గ్రూప్- బి అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎస్ స్టేడియంలో విజయనగరం, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 80.3 ఓవర్లలో 250 బరువులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని అభినవ్ 55, సాయి ప్రణీత్ 45, విగ్నేష్ 42 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సుశాంత్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం మొదటి ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో గుంటూరు. శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్లో 90.0 8 వికెట్లు నష్టానికి 334 పరుగులు చేసింది. ఆ జట్టులోని కౌశిక్ 92, డింకు రామ్ చరణ్ 81, డేవిడ్ 74 పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని సాత్విక్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం, కృష్ణా జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలత బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్లో 90.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆదినారాయణరెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 181 పరుగులు చేశాడు. కృష్ణ జట్టులోని భాను చైతన్య నాలుగు వికెట్లు తీసుకున్నాడు.

నేటి నుంచి భూగర్భ నీటి వనరుల సుస్థిరతపై శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 11నుంచి 13 వరకు 'భూగర్భ నీటి వనరుల సుస్థిరత- నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎర్త్ సైన్సెస్ విభాగం విభాగాధిపతి ఆచార్య టి. శివ ప్రతాప్, జియాలజీ విభాగాధిపతి ఆచార్య కె.రఘుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ జియాలజీ, డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, స్థానిక జిల్లా భూగర్భజల శాఖ అధికారులు, గ్రామీణ నీటి సరఫరాకు చెందిన ఇంజనీర్లు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ట్రైనీలుగా పాల్గొని ప్రయోజనాలను పొందనున్నార పేర్కొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో పోతుల వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని ఐఎంఎ హాల్లో పోతుల పరితోష్రెడ్డి పుట్టినరోజు వేడుకలకు పోతుల వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. పుట్టినరోజు చేసుకుంటున్న పిల్లవాడిని ఆశీర్వదించారు. కేక్ తినిపించి వేడుకల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో పరిదోష్ రెడ్డి తల్లిదండ్రులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

కేక్ తినిపిస్తున్న పోతుల వెంకటరామిరెడ్డి

బకాయిల చెల్లింపులో జాప్యం తగదు

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపులో జాప్యం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం కడపలోని యుటిఎఫ్ భవన్లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ 6 నెలల లోపల పూర్తి స్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఐదు నెలలైనా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం తగదన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా వేధింపులకు గురిచేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్ములను సైతం చెల్లించకుండా ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకుందని ఆరోపించారు. ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాలు, తుది చెల్లింపులతోపాటు పిఆర్సి, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు సైతం చెల్లింపులకు నోచుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం సైతం ఉద్యోగుల విషయంలో గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తుండడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు తమ వైఖరిని వెల్లడించకపోవడం తగదన్నారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, సి.శ్రీనివాసులు, కె.చెన్నయ్య, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.శ్రీనివాసులు, వి.మురళీకృష్ణ, బి.లక్ష్మీ ప్రసన్న, ఈ.బాలజోజి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరి, డి.కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం ప్రభాకర్, ఐక్య ఉపాధ్యాయ పత్రిక బాధ్యుడు గాజులపల్లె గోపీనాథ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్పై చర్యలు తీసుకోవాలి: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న చైతన్య కళాశాల ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్ రెడ్డి వివిధ రకాల కారణాలతో అధ్యాపకులను, స్టాఫ్ను మానసికంగా వేధిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాలశివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చైతన్య కళాశాల ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్ రెడ్డి గతంలో నారాయణ, ఎన్ఆర్ఐ కళాశాలలో పనిచేశారని ఆ సమయంలోనూ కూడా విద్యార్థులను, అందులో పని చేసే అధ్యాపకులను, స్టాఫ్ను చిన్న చిన్న కారణాలతో మానసికంగా ఇబ్బందులు పెట్టేవారని పేర్కొన్నారు. మరిన్ని కారణాలతో అక్కడ ఆయన్ను తొలగించారని తెలిపారు. ఇప్పుడు కూడా అతనిలో ఎటువంటి మార్పు లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ప్రిన్సిపల్పై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాల్య శుక్లంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : బాలల నేత్ర సంరక్షణా వారం పురస్కరించుకుని బాలల్లో కంటి వ్యాధులు, బాల్య శుక్లం వ్యాధులపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఎల్విపిఇఐ ఆధ్వర్యంలో నేత్ర సంరక్ష అవగాహనా నడక ర్యాలీ నిర్వహించారు. ఆదివారం కడపలోని ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రాంగణంలోని ర్యాలీ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప ఎల్విపిఇఐ డైరెక్టర్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి మాట్లాడుతూ పిల్లలలో అనేక కంటి వ్యాధులపట్ల సామాజిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున బాలలు, వారి తల్లిదండ్రులు, బాల్య శుక్లాలపై అవగాహన కలిగించడానికి ప్లకార్డులు పట్టుకుని నడకలో పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద ఎపి104 మొబైల్ మెడికల్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కడప కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. సంవత్సరాల తరబడి 104 ఉద్యోగులు పనిచేస్తున్నా వేతనాలు పెరగకపోవడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా ఏజెన్సీలు మారడం, ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 42 మంది పైలెట్స్, 40 మంది డేటాఎంట్రి ఆపరేటర్స్ పని చేస్తున్నారన్నారు. వీరికి చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని విమర్శించారు. మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేతనాలు ఇవ్వకపోగా, ఉద్యోగులకు భద్రత, రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వెళ్లి ప్రజలకు మెడిసిన్ ఇవ్వడంలో వీళ్ల పాత్ర కీలకమైందని చెప్పారు. ప్రస్తుతం ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానమైన పని సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ సక్రమంగా కట్టలేదని పేర్కొన్నారు. పిఎఫ్ 25 శాతం ఉద్యోగుల ద్వారా వసూలు చేయడం దుర్మార్గమని తెలిపారు. వీరి సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య,104 యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్, మహమ్మద్ అలీ, నాగేంద్ర, రమణ, జిల్లా వ్యాప్తంగా పైలెట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

దళితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-అట్లూరు

మండల పరిధిలోని దళితులకు ప్రభుత్వ భూముల్లో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అట్లురు మండల కార్యదర్శి ఇ.రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం అట్లూరు క్రాస్ రోడ్లోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తంబలగొందిగ్రామం, వారికుంట్ల కాలనీ, చెండువాయు కాలనీ, ఎగువపల్లె కాలనీ, వలస పాలెం కమలకూరు బిసి కాలనీలను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ దళితుల కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. ఒకే ఇంటిలో మూడు కుటుంబాలు ఉండడం చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఉపాధి పనులు దొరక్క చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళుగా నివాసముంటున్న వారికి ఇంటి స్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మరో వైపు కబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్న అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తూ పేదలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. పై సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న ఉదయం 10 గంటలకు అట్లూరు తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, కాలనీ వాసులందరకూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యమంలో వ్యవసాయ కార్మిక సంఘం, అట్లురు మండల నాయకులు, .రవిచంద్ర, వై తిరుపాల్రెడ్డి గంగయ్య, ప్రశాంత్, బి. స్వప్న పాల్గొన్నారు.

దళితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

మతిభ్రమించిన కూటమి ప్రభుత్వం

- కులనిర్ధారణ లేకుండా పదవులు : అంబకపల్లె నారాయణస్వామి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కూటమి ప్రభుత్వానికి కుల నిర్ధారణ లేకుండా పదవులు కట్టబెట్టడం చాలా దారుణమని, వాల్మీకులను కించపరచడం కూటమి ప్రభుత్వానికి సమంజసమేనా అని వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి అంబకపల్లి నారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలోని వాల్మీకి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏకి నాయుడులను వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో వాల్మీకులు 60 లక్షల మందికిపైగా ఉన్నప్పటికీ కప్పట్రాల సుశీలమ్మకు అలియాస్ (బుజ్జమ్మ)చైర్మన్ పదవి ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వాల్మీకులను కూటమి ప్రభుత్వం గుర్తించ కపోవడం, వారిని అవమానపరిచి కించపరచడం స్పష్టంగా అర్థమవుతోం దన్నారు. పదవులు ఇచ్చేటప్పుడు వారి బయోడేటా చూసి కట్టబెట్టాలే గాని, గుడ్డిగా పదవులు కట్టబెట్టడం కూటమి ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో వాల్మీకి బోయలు లేరా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన చైర్మన్ పదవిని ఉపసంహరించి స్వచ్ఛమైన వాల్మీకులకు పదవి కట్టబెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తప్పుడు నిర్ణయాలు తీసుకోవడంతో రాష్ట్రంలోని వాల్మీకుల మనో భావాలు దెబ్బతీశారన్నారు. ఏకి నాయుడులు తాము వాల్మీకులం కాదని స్పష్టంగా ఒక ఇంటర్వ్యూలో చైర్మన్‌గా ఇచ్చిన బుజ్జమ్మ చెప్పారన్నారు. ఇప్పుడు ఇచ్చిన 59 మంది కార్పొరేషన్ల చైర్మన్ పదవులను వాళ్ల కుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు.

భిక్ష ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

అయ్యప్ప భక్తులకు భిక్ష

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల శ్రీ మిట్టమనేశ్వర స్వామి దేవస్థానంలో రాగిమనపల్లె వైసిపి సర్పంచ్ గజ్జల అనూష మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమార్తె గంగావర్షిక పుట్టినరోజు సందర్భంగా ఆదివారం 700 మంది అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీని మహేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. అయ్యప్ప భక్తులకు ఎంపీ భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి భిక్ష ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, యర్ర వెంకటసుబ్బయ్య, ఒనిడా సుబ్బారెడ్డి, కౌన్సిలర్ పానపల్లి కిషోర్, తుమ్మలపల్లె హేమంత్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ముత్తూరు రమణ దంపతులను సన్మానిస్తున్న గురుస్వామి రాఘవరెడ్డి

ఖాజీపేట : మండల పరిధిలోని పూసల కొట్టాలు సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారి వద్ద అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ దంపతులు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ అధ్యక్షుడు పత్తి వెంకటకృష్ణారెడ్డి, గురుస్వాములు రాఘవరెడ్డి, కారంశెట్టి సుబ్బారావు, ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప భక్తులకు దాతలు భిక్ష ఏర్పాటు చేయడం పుణ్య కార్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి దాత దంపతులను ఘనంగా సత్కరించారు.

యథేచ్ఛగా తరలిపోతున్న గ్రావెల్

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా చేపట్టడంతో వేంపల్లెలోని కొండలు రుషికొండలను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగడంతో కొండలను పిండి చేశారు. గత పాలనలో కొండలను గుల్ల చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. కొండలను భూములుగా తయారు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైసిపి పాలనలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి పొందిన ఓ ప్రయివేట్ సంస్థ ప్రస్తుతం కూటమి నాయకులు తవ్వకాలు చేపట్టకుండా అడ్డుకుంది. తవ్వకాలకు అనుమతించిన ప్రదేశాల్లో కాకుండా విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నారని టిడిపికి చెందిన ఓ గ్రూపు నాయకులు ఆరోపిస్తుండగా, వైసిపి పాలనలో విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోని లీజును రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరతామని మరో గ్రూప్ టిడిపి నాయకులు చెబుతున్నారు. ఆదివారం పాములూరు గుట్ట సమీపంలో చేపట్టిన గ్రావెల్ తవ్వకాలను రాయల్టీకి చెందిన సిబ్బంది ట్రాక్టర్లను, జెసిబిని అడ్డుకున్నారు. దీంతో తమకున్న డీకేటీ భూమిలో చదును చేసుకుంటున్నామని గ్రావెల్‌ను తవ్వకాలు చేస్తున్నా వారు చెప్పడంతో రాయల్టీ సిబ్బందికి తవ్వకాలు చేస్తున్న వారికి వాగ్వివాదం జరిగింది. గ్రావెల్ పంచాయతీ పోలీసు స్టేషన్‌కు చేరింది.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక నాగార్జున ఐటిఐ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు గీతాంజలి ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాకు దాదాపు 315 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 150మంది నాన్ ఐటికి, 150 మంది ఐటికి, మిగతా 15 మంది వయసు పైబడిన వారు హాజరయ్యారు. వీరిలో నాన్ ఐటి విభాగంలో టాటా-మోటర్స్‌కు 60 మంది, ఎన్‌ఫ్లోడ్ కంపెనీకి 60 మంది, టివిఎస్ కంపెనీకి 30 మంది, డెక్సాన్ సి.సి.కెమెరాకు 50 మంది ఎంపికైనట్లు నాగార్జున ఐటిఐ ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. ఐటి విభాగంలో సైబర్ సెక్యూరిటీకి 40, మంది డేటా సైన్స్‌కు 40 మంది, నెట్‌వర్క్స్‌కు 20 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఆయా కంపెనీల విధివిధానాలను అనుసరించి ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాలలో చేరవలసి ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మహిళానాయకురాలు మల్లేల లక్ష్మీప్రసన్న, గీతాంజలి కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు మురళి, శ్రీధర్, దామోదర్ హాజరయ్యారు.

మైదుకూరు కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా చాపాటి రామసుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా చాపాటి రామ సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు ఎపిసిసి అధ్యక్షులురాలు షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన చాపాడుకు చెందిన చాపాటి రామసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పని చేశానన్నారు. తనను గుర్తించినందుకు జాతీయనేత రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కనీస అవసరాలకు నోచని పేదల కాలనీ

కనీస సౌకర్యాల్లేని సుందరయ్య పేదల కాలనీ

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరులోని నానువారిపల్లెకు వెళ్లే మార్గంలో బిసి, ఎస్‌టి వసతిగృహాల ఎదురుగా కొత్తగా ఏర్పడిన సుందరయ్య పేదల కాలనీలో కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితిలో ప్రభుత్వాలు కొన సాగుతున్నాయి. కనీస అవసరాలకు కూడా నోచుకోని 100 కుటుంబాలున్నాయి. వీరిని పట్టించుకొనక పోవడంతోపాటు ఎలాంటి వసతులు ఏర్పాటు చేయలేని దుస్థితిలో అధికారులున్నారు. మైదుకూరులోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలు సిపిఎం అండతో గుడిసెలు, చిన్నపాటి రేకుల షెడ్డుతో ఇళ్లను నిర్మించుకున్నారు. కాలనీ ఏర్పడి ఏడేళ్లు కావస్తున్నా తాగునీటికి కూడా ఇబ్బందిపడుతున్నారు. విద్యుత్ సదుపాయం, రోడ్లు, డ్రయినేజీ వంటివాటి గురించి ఇక చెప్పనక్కర్లేదు. కాలనీ అంతటికి ఇప్పటికి కూడా ఒకటే కుళాయి అందుబాటులో ఉంది. సిమెంటు రోడ్లు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడున్న 100 కుటుంబాల వారు ప్రతి రోజు కూలి పనులు, చిన్నచిన్న రోజువారి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో కానీ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వీరి గురించి పట్టించుకునే నాథుడులేడు. గతంలో అనేకసార్లు సిపిఎం జిల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో కొన్ని కనీస అవసరాలను తీర్చుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అనేకమార్లు వీరి సమస్యలను పరిష్కరించాలని ర్యాలీలు, నిరసనలు వ్యక్తం చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారంలోకి వస్తే రోడ్లు, డ్రయినేజీ, నీటి వసతి కల్పిస్తామని హామీలు ఇచ్చినవారు కనిపించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలైన 100 కుటుంబాల వారిని ప్రభుత్వం చిన్నచూపు చూడకుండా వీలైనంత త్వరగా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఎలాంటి వసతులు లేవు..

సొంత ఆస్తులు లేక బాడుగ ఇళ్లల్లో జీవిస్తున్న 70 కుటుంబాలవారం సిపిఎం అండతో కాలనీ ఏర్పాటు చేసుకున్నాం. కాలనీలో విద్యుత్‌తోపాటు ఇతర కనీస అవసరాలు కూడా తీర్చే పరిస్థితిలో అధికారులున్నారు. కాలనీ మెత్తానికి ఒక్క కుళాయి దిక్కు. దీంతోనే 100 కుటుంబాలు నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శివ, సుందరయ్య కాలనీ

పాడి పరిశ్రమే జీవనాధారం..

చాపాడు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన తమ కుటుంబానికి ఎలాంటి ఆసరా లేకపోవడంతో మైదుకూరు కాలనీలో చిన్నపాటి గుడిసె వేసుకున్నాం. పాడి పరిశ్రమ ఆధారంగా జీవనం సాగిస్తున్నాం. కాలనీలో ఎలాంటి వసతులు లేవు. రాత్రి వేళ చీకటిలో గడపాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపేదల కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి.

- రంతు, సుందరయ్య కాలనీ

కాలనీకి అంతా ఉన్న ఏకూక బోరు

తెలుగు దీపానికి శాశ్వత వెలుగు సిపి బ్రౌన్

సిపి బ్రౌన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విసి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు భాషా సాహిత్యాలు తాళపత్రాల్లో అగ్గిపురుగులకు ఆహుతవుతూ మిణుకు, మిణుకుమంటున్న దశలో తెలుగు దీపానికి శాశ్వత వెలుగు నిచ్చిన మహనీయుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 226వ జయంతిని నిర్వహించారు. ముందుగా రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశ మందిరంలోని సి.పి.బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలసి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.పి.బ్రౌన్‌లో మనం ఆదర్శంగా తీసుకోవాల్సిన మూడు సద్గుణాలున్నాయన్నారు. అవి క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధత అని వివరించారు. ఆ లక్షణాలతో సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, స్థలదాత సి.కె.సంపత్ కుమార్ లాంటి ప్రముఖులతో కలసి బ్రౌన్ నివసించిన బంగళా శిథిలాలపైనే సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయమనే జ్ఞానసౌధాన్ని నిర్మించి చిరకీర్తులయ్యారన్నారు. విశిష్ట అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఊపిరి కోల్పోతున్న తెలుగు భాషకు ప్రాణం పోయడానికి సి.పి.బ్రౌన్ దిగివచ్చాడన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డేవిడ్ బ్రౌన్, కౌలే దంపతులకు రెండవ సంతానంగా సి.పి.బ్రౌన్ జన్మించారన్నారు. మద్రాసులో శిక్షణలో ఉన్నప్పుడు తొలిసారిగా వెలగపూడి కోదండరామయ్య పంతులు దగ్గర తెలుగు నేర్చుకున్నారన్నారు. గౌరవ అతిథి, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ తన మాతృభాష కానటువంటి తెలుగుపై పట్టు సాధించి నిఘంటువుల నిర్మాణం చేస్తే తెలుగువారైన మనం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ ఆంగ్లంపై మక్కువ పెంచుకోవడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను, సాహితీవేత్త ఎస్.ఆర్.ప్రతాప రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అష్టావధానం : మధ్యాహ్నం పరిశోధన కేంద్రంలోప్రముఖ అవధాని శారదాప్రసన్న అధ్యక్షతన తిరుపతికి చెందిన యువ అవధాని, శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ చేసిన అష్టావధానం సాహితీ ప్రియులను అలరించింది. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యాపకులు ఆచార్య రమాదేవి, డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ జయంత్ కశ్యప, బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, సిబ్బంది, గానుగపెంట హనుమంతరావు, ఎం.నారాయణ రెడ్డి, మాడుగుల శివశ్రీ శర్మ, భూపతి రాయల్, కరీముల్లా, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

వేంపల్లె : సిపి బ్రౌన్ దొర తెలుగు సూరీడు, తెలుగు భాషోద్ధారకుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో బ్రౌన్ దొర 226వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ దొర ఒక ఆంగ్లేయుడు అయినప్పటికీ కడపలో ఇల్లు నిర్మించుకొని, తెలుగు భాష నేర్చుకొని, తెలుగు నిఘంటువును రచించి అంతరించి పోతున్న తెలుగు భాషకు పునరుజ్జీవం పోశారని కొనియాడారు. బ్రౌన్ దొర లేకుంటే మహాకవి వేమన ఆటవెలది పద్యాలు లభించి ఉండేవి కావన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమారాజా, వేమయ్య, బద్రి, రవి, బాలం సుబ్బ రాయుడు, అరుసెర్ల సుబ్బరాయుడు, వెంకటేష్, మాష్, రమణ, నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛను పెంచకపోవడం దారుణం

కనీసం పింఛన్ రూ.9,000కు పెంచాలని18న ఇపిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా

మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగస్తుల కన్వీనర్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భారతదేశం ఆర్థికంగా ఎదగడం కోసం అప్పటి పరిశ్రమల్లో, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసిన కార్మికులకు ఇప్పటికీ పింఛన్ పెంచకపోవడం దారుణమని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్స్ అసోసియేషన్ కడప జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి పేర్కొన్నారు. స్థానిక పాతసత్రం బడి ఆవరణలలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కనీసం పింఛన్ రూ.9000కు పెంచాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఈనెల 18న ఇపిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఆందోళనను విజయవంతం చేయాలని వారు కోరారు. దేశ సంపద కోసం శ్రమించి పనిచేసి నేడు వృద్ధాప్యంలో ప్రస్తుతం రూ.800 పెన్షన్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూ.9,000కు పెంచాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ కనీసం మందుల ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. డిఎ ఇవ్వాలని, ఆర్ఒసిని పునరుద్ధరించాలన్నారు. పెన్షన్ లెక్క కట్టే విధానాన్ని మార్చాలన్నారు. ప్రస్తుతం పెన్షన్ అందక మరణించిన వారి డబ్బులు రూ.75 వేల కోట్ల వరకు ఈపీఎఫ్ ఆఫీసుల ఖాతాలో ఉన్నాయన్నారు. వాటి నుండి వస్తున్న వడ్డీ డబ్బులతోనే రూ.9,000 పెన్షన్ అమలు చేయవచ్చన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమావేశంలో రైతు స్వరాజ్యం నాయకులు శివారెడ్డి, జిల్లా కోశాధికారి హరిచంద్రరెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ పులివెందుల నాయకుడు పాపిరెడ్డి, పులివెందుల సిఐటియు కార్యదర్శి గఫూర్, పులివెందుల నియోజకవర్గం పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువ ఉత్సవాల్లో ప్రతిభ చాటాలి : ఎంపీ

పజాశక్తి - పులివెందుల టౌన్

యువ ఉత్సవాల్లో జిల్లాలోని యువత ప్రతిభ చాటాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే యువ ఉత్సవ్-2024 పోస్టర్లను ఎంపీ నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఉత్సవ్‌లో భాగంగా ఇండియా-2047 పోటీలలో ఉమ్మడి కడప జిల్లా యువత అన్ని విభాగాల్లో పాల్గొని జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ మాట్లాడుతూ ఇండియా-2047 అనే అంశంపై పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాల్లో వక్తృ పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్ (గ్రూప్), సైన్స్ మేళా సింగిల్ గ్రూప్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలు జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి, రాష్ట్రస్థాయి నుంచి దేశ స్థాయికి పంపుతామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ఉంటాయన్నారు. 15 సంవత్సరాలు నిండిన యువత పేర్లు నమోదు చేసుకోవాలి అనుకునేవారు 91776 16677ను సంప్రదించాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది సుబ్బారావు, సుబ్బయ్య, అరవింద్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ధైర్యంగా ఉంటే త్వరగా కోలుకుంటారు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ధైర్యంగా ఉండడం వల్ల త్వరగా కోలుకుంటారని గాయపడిన కార్యకర్తలకు వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మనోధైర్యం నింపారు. ఆదివారం హైదరాబాద్ సిటీ న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కార్యకర్తలను ఎమ్మెల్సీ పరామర్శించారు. ఈ మధ్యకాలంలో కూటమి నాయకుల చేతిలో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ సిటీ న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జమ్మలమడుగు రూరల్ పెద్ద దండ్లూరు గ్రామానికి చెందిన రామ్నాథ్‌రెడ్డి, హనుమంతురెడ్డి, వెంకటసుబ్బారెడ్డితో పిఆర్ మాట్లాడారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

సభ్యత్వ నమోదులో టిడిపి నాయకులు

టిడిపితోనే కార్యకర్తల సంక్షేమం

ప్రజాశక్తి - ఖాజీపేట

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదును తప్పక చేయించుకోవాలని ఆపార్టీ నాయకులు గడ్డం జానకీ రామ్ నాయుడు, గడ్డం గంగి నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పత్తూరు పంచాయతీ డాంఖాన్‌పల్లెలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు వల్ల పొందే ప్రయోజనాలను వివరించారు. ఈ అవకాశాన్ని కార్యకర్తలు, అభిమానులు, నాయకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

దోమకాటు - ఆరోగ్యానికి చేటు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమకాటు ఆరోగ్యానికి చేటు అని సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్దయ్య అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం-1 విద్యార్థులకు దోమకాటు వల్ల వచ్చు వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గన్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వ్యాధులకు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సిద్దయ్య సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 38 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని, వారి జీవన స్థితిగతులు పంచుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమిరెడ్డి వెంకట రామిరెడ్డి, శ్రీరాంరెడ్డి, టిసి గంగిరెడ్డి, అశ్వర్థరెడ్డి, జి.క్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రోగ్రాం ఆర్గనైజర్ మల్లెల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తులసిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఖాజీపేట

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డికి కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. ఖాజీపేటలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన ఖాజీపేటకు విచ్చేశారు. ఎంపిటిసి సభ్యులు ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గున్నంపాటి వెంకటరమణ, హాజీ గౌస్, రమణ, ప్రతాపరెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని, పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా తులసిరెడ్డి సూచిం చారు. అమర్నాథరెడ్డి ఉత్తన్న, విజయ్, బాలం సుబ్బరాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల కమిటీ ఎన్నిక

- కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా లలిత, సునంద

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఎన్నికైన సభ్యులకు సూచనలిస్తున్న గఫూర్

పులివెందుల నియోజకవర్గ ఆశ వర్కర్ల కమిటీని ఏర్పాటు చేశారు. సిఐటియు అనుబంధం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రాజమణి, సిఐటియు పులివెందుల కార్యదర్శి గఫూర్ నూతన కమిటీని ఆదివారం పులివెందుల సిఐటియు కార్యాలయంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా లలిత, కార్యదర్శిగా సునంద, కమిటీ సభ్యులుగా పద్మావతి, వెంకటేశ్వరమ్మ, ఇందిరా, ప్రమీల, శివనారాయణమ్మ, ప్రభావతి, సంజమ్మ, రాధ, అరుణ, చంద్రకళ, సురేఖ, భారతి, నాగరత్నమ్మను ఎన్నుకున్నారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

అర్హత పత్రాలను తీసుకోవాలి : ఆర్‌డిఒ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఓటు నమోదు కేంద్రాన్ని ఆదివారం ఆర్‌డిఒ భాను శ్రీ పరిశీలించారు. పట్టణంలోని 86, 87 పోలింగ్ కేంద్రాల్లో ఓటు నమోదు కేంద్రం వద్ద ఓటర్ల నమోదు ఏవిధంగా జరుగుతోంది.. ప్రజల నుంచి ఏవిధంగా స్పందన ఉందని పరిశీలించారు. ప్రజల్లో ఓటు నమోదు చేయడానికి కావాల్సిన అర్హత పత్రాలను తప్పని సరిగా దరఖాస్తుదారుల నుంచి తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంత మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉర్దూ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ఐ అండర్-14 రగ్బీ పోటీల్లో వేంపల్లె జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచినట్లు హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. కమలాపురంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ రగ్బీ పోటీల్లో బాలికల విభాగంలో పి.బిందు మాధవి రెండవ స్థానం, బాలుర విభాగంలో ఎస్.నూరుల్లా మూడవ స్థానంలో రాణించినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు సివిఎస్ రాయుడు, ఎస్.షాహీన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభి నందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మొగిలి లక్ష్మీదేవి(45) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీదేవి ఇంటి వద్ద మరుగుదొడ్డిలో మోటర్ వేసుకుని నీరు పట్టుకుంటుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగులుకుని షాక్‌కు గురైంది. మహిళ పడిపోయి ఉండడాన్ని గుర్తించిన అత్త ఓబుళమ్మ లేపేందుకు ప్రయత్నించగా ఈ సంఘటన గమనించిన కుమారుడు రామోహన్ స్విచ్ ఆఫ్ చేయడంతో ఓబుళమ్మ ప్రాణాలతో బయట పడింది. అప్పటికే లక్ష్మీదేవి చనిపోయింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

చియ్యపాడు దళితవాడ చౌక దుకాణంపై కేసు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు దళితవాడ చౌక దుకాణంపై 6-ఎ కేసు నమోదు చేసినట్లు ప్రొద్దుటూరు ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహశీల్దారు మల్లికార్జున తెలిపారు. దళితవాడలో చౌక దుకాణంలో తనిఖీలు నిర్వహించగా 10 క్వింటాళ్ల బియ్యం, 25 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉన్నాయని. వీటికి సరైన లెక్కలు చూపకపోవటంతో కేసు నమోదు చేసినట్లు డిటి తెలిపారు.